

# మగువలూ మనసులూ!

యన్. సిహెచ్. వీరాచారి

ఎస్. నారాయణరావు, సి. ఎ., ఇన్— అన్న బోర్డును సెయింట్‌గేటువద్ద చూసిన రాఘవరావుగారు సంతృప్తికరమైన చిరునవ్వొకటి విడిచి ఆవరణలోనికి ప్రవేశించారు. ద్వారపాలకుని కలుసుకొని రావు హాలులో ఉన్నట్లు తెలుసుకొని అతని అనుమతితో ద్వారంవద్దనున్న కర్టెను తొలగించి లోన ప్రవేశించారు. ఆ బిల్డింగు విశాఖపట్నం కో-ఆపరేటివ్ కాలనీలో నూతనంగా ఆధునిక పద్ధతిలో నిర్మింపబడ్డ 'ఏ' తరగతి భవనం. హాలు విశాలంగా ఉంది. రెండు పొడవైన ఉన్నిస్ తొడిగిన దిండ్లుగల సోఫాలు మూడు పేము కుర్చీలు ఉన్నాయి. రెండు సోఫాలకు, మధ్యగా దక్షిణం వైపు రేడియోగ్రామ్ టేపురికార్డర్లు ఉన్నాయి. వాటికిరువైపులా ఫ్లవర్‌వేజులున్నాయి. ఉత్తరవైపు లోపలి గదులలోనికి ద్వారాలున్నాయి. పరస్పర నమస్కారానంతరం ఆ అపరిచిత నూతన వ్యక్తిని ఆహ్వానించి ఆసనం చూపించాడు రావు. ఇక వచ్చిన పనిని గూర్చి తెలియజేయడం ఆయన ధర్మం.

"నన్ను రామారావునాయుడంటూ రండి! స్వస్థలం అనకాపల్లి. రెండు మూడేళ్ల వెనుక నేనొక ప్రముఖ వ్యాపారస్థుణ్ణి. నిజానికి అంత పెద్ద వ్యాపారం చేసినా ఏమీ సంపాదించలేకపోయాను. కాని... నిజం తెలుసుకోలేని ఈ ఇన్‌కమ్‌టాక్సు వాళ్ళు నాకున్న రెండు మూడు మేడలను ఒకటాయిను చూసి రెండు లక్షలు మేకప్పు చేశారు. నిజానికి నా ఆస్తి అంతా అమ్మినా రెండు లక్షలుండదు. కోర్టులో, పిటిషన్ దాఖలు చేసుకు చేసుకున్నాను. అంత పెద్దమొత్తం వేయడం అన్యాయమని..! మీ పేరు ప్రఖ్యాతులు విని మీ సహాయాన్ని అర్థించడానికి వచ్చాను. తమరు ఏమయినా చేసి, కోర్టులో నా ఎక్కౌంట్సు పరిశీలించారంటే నా క్లిష్ట పరిస్థితి మీ కర్థమవుతుంది." అని రామారావు ఒకింత విచార వదనంతో, కవంత గాద్గదిక స్వరంతోనూ ముగించారు. ఆయన వార్ధక్యంలోనికి అడుగుపెడుతున్న వ్యక్తి. నిండైన విగ్రహం. నారాయణరావు పేరు విన్న ఆయన, అతను బహుశా ఓ సంభై ఏళ్ల వయసువాడైనా అయి ఉంటాడని అనుకున్నారు. నారాయణరావు చూసిన తరువాత యింత చిన్న యువకుడా! ఆశ్చర్యముతో పాటు అనుమాన సౌమ్యంతో, ఇరవై ఐదు లేక ఇరవై ఏడేళ్ళ వయసున్న నారాయణరావుని చూసి ఆయన మనస్సు ఉల్లాసపడింది. చిన్న వయసులోనే అంత పేరు తెచ్చుకున్న రావుని చూసి ఆయన అంతరాత్మ ఆనందపడింది.

నారాయణరావు ఆయన సంభాషణంతా విన్నారు. ఆయన విచారాన్ని అర్థం చేసుకోగలిగాడు. ఆ సమయంలోనే, ఆ స్వల్ప వ్యవధిలోనే అతనికి మనసారా చేతనైనంత సహాయం చేయాలి. ప్రపంచంలోని వ్యక్తులందరిపై విభిన్న మనస్త

త్వాలు, విభిన్న రూపురేఖలు. కాని ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తిని చూసినప్పుడుగాని, మాట్లాడి నప్పుడు గాని, ప్రథమంలోనే ఒక అభిప్రాయం మంచిదైనా, చెడ్డదైనా అప్రయత్నంగా ఏర్పడి పోతుంది. ఒకర్నిచూసిన మనస్సు వారితో స్నేహం చేయాలని వారి సన్నిహితత్వం కావాలని కోరుతుంది. సహాయం చేసే స్వభావంగల మన స్సుకు కొందర్ని చూసిన వెంటనే వారికి సహాయం చెయ్యాలని వార్ని కష్టాలలో ఆదుకొని ఆదరించాలని అభిలషిస్తుంది. ఆమనస్సే అకారణంగా ఒకరిని చూసి దురభిప్రాయ పడుతుంది. ద్వేషిస్తుంది. అసహ్యించుకుంటుంది. కొన్ని విషయాలలో పోటీదా తలపెడుతుంది. ఆ మనస్సుకది సహజం...! నారాయణరావు అడిగాడు.

"మీ ఎక్కౌంట్సు అన్నీ అనకాపల్లిలోనే ఉన్నాయనుకుంటాను."

"అవునండీ!... తమరు తీసుకు రమ్మనమంటే తీసుకొస్తాను. కాని ... నా మనవేమిటంటే తమరు ఏమీ అనుకోకుండా రెండుమూడు పర్యా యాలు అక్కడికి వచ్చారంటే సావధానంగా మీ కన్ని విషయాలు తెలియజేయడానికి వీలుంటుంది. మీ రెప్పుడొచ్చేది తెలియజేస్తే నా కారు పంపు తాను."

"సరేలెండి! నా కారులోనే వస్తా . కాని, ఆదివారాలలో వస్తుంటాను ... మీరు వచ్చే వారం మా తం రండి."

"ధన్యుణ్ని! మీ పరిచయ భాగ్యానికి కృత జ్ఞుణ్ని. మీరెంత సహృదయులని, వినయవంతు లని వూహించలేక పోయాను. మీరు చిన్నవాళ్ల యినా నమస్కారం చేయాలనిపిస్తోందండి!"

"మీరు పెద్దవారు. మాకు గౌరవనీయులు. చిన్నవాళ్లను అలా అనకూడదు."

సంభాషణ ముగిసిన తరువాత రామారావు గారు సెలవు తీసుకొని వెళ్లిపోయారు.

* * *

మానవుని జీవితానికి నిత్య జీవితంలోని సంఘ టనలకూ అవినాభావ సంబంధముంది. ఒక్కొక్క సంఘటనవల్ల అతని జీవితం ఉజ్వల భవి ష్యత్తుతో విరాజిల్లవచ్చు. లేదా వూహించలేని విధంగా దిగజారిపోవచ్చు. ఆ సంఘటనలు జరిగిన తరువాత, అలా జరిగి ఉండకపోతే, మన జీవితం ఇంకోలా వుండేదే అని వాపోవడంగాని, అలా ఆ సంఘటన జరిగివుండకపోతే మనం ఇంత నష్టం అయేవాళ్లమా అని అనుకోవడంగాని పరిపాటి. ఒక నూతన వ్యక్తితో పరిచయం, ఓరోజు ప్రయాణం, ఒకరికి సహాయం చేయడం మొదలైన చిన్నచిన్న సంఘటనలే అతని జీవితంలో ఓ మలుపు దశకు నాందిగా నిల్చిపోతాయి. వాటిని మనం కాదని తప్పించుకోలేం! కావాలని రప్పించు కోలేం.... !

ఆ రోజు ఎక్కౌంట్సు చూసి నారాయణరావు వెళ్లిపోవడాని కుద్యుక్తుడవుతుండగా, రామారావు గారు ఇరవై సంవత్సరాల వయసున్న యువతిని తీసుకొని వచ్చి, ఆమెపేరు 'ఇందిర' అని బి. ఎ. ప్యాసయిందని, ఆమే తనకున్న ఏకైక సంతాన మని పరిచయం చేసారు రావుకు. ఆమె రావుకు నమస్కరించడంతో ఇతను కూడా నమస్కరించి కల్సుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరచాడు.

రోజులు గడుస్తున్నాయి. కాలం సాగిపోతున్న కొలదీ మానవునిజీవిత పరిమితి తగ్గి పోతూ వుంటుంది. అనుకోని విధంగా అన్యులతోటి అప్ర యత్నపు పరిచయం. ఆ పరిచయాల ఫలితాలు, విషాదాన్ని చేకూర్చటం పరిపాటి. అప్పుడప్పుడు నారాయణరావు అనుకుంటాడు: "నాకు ఇందిర, అరుణ కుటుంబాలతో పరిచయమున్నప్పటికీ, వాళ్లతో వనవుగా ప్రవర్తించకుండా ఉండవల సింది" కాని. . .అలా అనుకోవడం అర్థంలేనిది. అప్రయత్న పూర్వకంగా జరిగే సంఘటనలకు వాటి ఫలితాలకు అతడు మాత్రం బాధ్యుడు కాడు. ఆ బాధ్యత ఓ అవ్యక్తమైన శక్తిది.

ఆ రోజు నారాయణరావు ఎక్కౌంట్సు చూసిన తరువాత మరొక్కసారి వచ్చినట్లయితే పని పూర్తవుతుంది గదా! అని సంతృప్తికరమైన నిట్టూర్పొకటి విడిచాడు. రామారావుగారొస్తే ఆయనతో ఈ విషయం చెప్పిపోవచ్చుగదా అని ఆయన రాకకు ఎదురు చూస్తున్నాడు. ఆయ నింకా రాకపోవడంతో అక్కడేవున్న ఓ ఓ లె హిందీ ఇంగ్లీషు మేగజైన్సు తీసుకుని చూస్తు న్నాడు. అడుగుల చప్పుడవడంతో దారంవైపు దృష్టి సారించాడు. ఇందిర అక్కడ నిల్చొని ఉంది. ఇందిరను తనకు శంకరంగారు పరిచయం చేసిన తరువాత అప్పుడప్పుడామె శంకరంగారితో కనిపిస్తుండడం, వారిరువురి సంభాషణలో పాల్గొనడం జరుగుతుండేది. కాని. . .యిలా నారాయణరావుకై ప్రత్యేకంగా కేటాయించిన గదిలోనికి నారాయణరావొక్కడే ఉండగా ఇందిర రావడం అదే ప్రథమం. . .ఆమెను గమ నించిన రావు. . . . .

"ఏమండీ. . . !" అన్నాడు. ఆ సంబో ధనా ద్వారం ఆమెను రాకకు గల కారణాన్ని తెలియ జెయ్యమని కోరుతున్నట్లుంది.

"మీతో ఒక విషయం చెప్పాలని. . . . !" రావుకు కొంచెం ఆశ్చర్యమేసింది. ఆమె తనతో చెప్పబోయే విషయాన్ని వూహించలేక పోయాడు. ఆమెవైపు పరిశీలనగా చూసాడు. కులీన కుటుంబపు పసితని ఆమె సంభాషణను బట్టి ఆమె ప్రవర్తనను బట్టి సులువుగా గ్రహించ వచ్చుననుకున్నాడు. ఆమె తన పమిటతో శరీరాన్ని కప్పుకుంది. ఆమెకళ్లలో ఓ అవ్యక్త మైన అపార ఆకర్షణశక్తి వున్నట్లు రావుకు తోచింది. ఆమె కళ్లలోనికి చూస్తూ అన్నాడు. "చెప్పండి....!"

"నాన్నగారు నాగురించి తరచు బాధపడుతుం టారు. నాకేమీ ఆస్తి విడిచిపెట్టకుండా నన్ను నిరాధారురాలిగా తను చేసినట్లు దుఃఖపడుతుం టారు. నేనెంత చెప్పినా వినరు. ఎప్పుడూ అదే ఆలోచన. . .! ఆ వ్యథవల్ల ఆయన ఆరోగ్యం కూడా పాడవుతుంది. మీరంటే ఆయనకు చాలా గౌరవం. అభిమానం కూడా! మీరొక సారి దయయుంచి అనవసరంగా బాధపడవద్దని ధైర్యం చెప్పండి. . ." ఆమె తన చివరి వాక్యాన్ని తనవైపు చూస్తున్న రావును చూస్తూ అంది. ఆమె చూపులు ఆమె ఆంతరంగిక ఆవేదననూ, అత్యంత ప్రాధేయతనూ సూచిస్తున్నాయి. నారాయణరావు ఆమె విచారాన్ని తన సహాయం పట్ల ఆమె ఉత్సుకతనూ గుర్తించగలిగాడు. కాని అతను. . . . .

"నాన్నగారికేగాని నేనంటే మీకు గౌరవం. లేదన్నమాట. . . . !" అన్నాడు నవ్వుతూ!

ఇందిర చిన్నబోయింది. అతని నుండి యిటువంటి సమాధానాన్ని ఆశించలేకపోయింది ఆమెమోము చిన్నబోయింది క్షణకాలం నివ్వెర బోయింది. వెంటనే ఏమని చెప్పాలో నిర్ణయించు కోలేక పోయింది.

"అహా! నా ఉద్దేశ్యం అదికాదండీ . . . !" అంది అవనత ముఖియై! అప్పుడామె మునివ్రేళ్లు పెదవి మెరగను పట్టుకొనివున్న కుడిచేతి ఉంగ రపు వేలి, ఆకుపచ్చనిరాతి ఉంగరం మాద ఉన్నాయి. నారాయణరావు నిండుగా ఒకింత పశ్చాత్తాప పడ్డాడు. తన చతురత అందువల్ల ప్రసంగం వల్ల ఆమె మనసు నొచ్చినట్టైనా గ్రహించ డానికి ఎంత సేపు పట్టలేదు. ఆమెను అను నయించాలని. . .

"మీరికనే హాస్యానికలా అన్నానండి. . .! నాన్నగారితో తప్పకుండా చెప్తాను ధైర్యంగా ఉండమని. . .! అవును . . .దానికేంగాని మీకిక్కడ కాలం ఎలాగడుస్తుంది? ఇంతపెద్ద మేడలో మీరొక్కరే ఎలా వుండగలుగుతున్నారు?"

ఇందిర ఆ చిన్నవేళాకోళంలో ప్రశాంతంగా కాస్త తేరుకుంది. రావు ప్రసంగాన్ని మార్చి మాటిగింపడం తన్ను వూరడించడానికేనని గ్రహిం చింది.

"ఎక్కువకాలం నాన్నగారు చెప్పే కబుర్లు వింటూ కూర్చోవడం. . .మిగిలిన వేళల్లో రేడియోతోనూ కాలం గడిచిపోతుంది. . . . ."

"మీరు స్టడీస్ కంటిన్యూ చేయవలసింది!"

"మొదట్లో యూనివర్శిటీలో చేరి ఎమ్. ఏ సోషల్‌వర్క్ మెయిన్‌గా చదువుదామనుకున్నాను. కాని. . . .నాన్నగారి గురించే ముఖ్యంగా మాను కోవలసి వచ్చింది. . . . ."

ఇంతలో రామారావుగారు రావడంతో రావు సెలవు తీసుకొని వెళ్లిపోవడం జరిగింది.

* * *

రోజులు గడుస్తున్నాయి! ఒకరోజు నారా యణరావు డాబాగార్డెన్సులోని ఓ ఆధునిక భవనంలోని గదిలో కూర్చొని ఎక్కౌంట్సు చూస్తున్నాడు. గది కానుకుని వున్న హాలంతా ఆకుపచ్చని విద్యుద్దీపపు కాంతితో ఆచ్ఛాదితమై అందంగా వుంది. గదిలో ట్రాన్సిస్టర్‌ఫోన్ మెల్లగా తిరుగుతూవుంది. ఇంతలో రావు ప్రక్కనే కూర్చొనివున్న శంకరంగారు లేచి..

"రావ్! యిందాక నా స్నేహితుడొకడు ఫోన్ చేశాడు. అతన్ని కలుసుకోవడానికి వెడుతున్నాను. ఆవిక్కడవుంటుంది చూడటం అయిన తరువాత నీవు వెళ్ళిపో. నే వచ్చేవరకూ వేచివుండనక్కర్లే!" అన్నారు.

"అలాగే అండీ!"

కానీ యింతలో శంకరం గారి చిరకాల సేవకుడు :

"అరుణమ్మగారు కాలేజీకి కారు పంపమన్నారు బాబూ!" అని విన్నవించుకున్నాడు. వెళ్ళడానికి వుద్యుక్తుడవుతున్న శంకరంగారు తిరిగి గదిలోకి వచ్చి ... .... ....

"రావు!అరుణ యూనివర్శిటీకికారుపంపమంది ట్రోయ్! నేను నా కారు తీసుకుపోతున్నాను. నీ కారు పంపించు! నే నొచ్చేసరికి ఎంత ఆలస్యమవుతుందో ... !" అన్నారు.

"సరే లెండి!" సమాధానమిచ్చాడు రావు.

శంకరంగారు నారాయణరావుకు గురువులాంటివారు. రావు తన బి. కాం; యూనివర్శిటీకి ద్వితీయుడుగా ప్యాసయిన తరువాత, చార్టర్డ్ ఎకౌంటెంటుపరీక్షకు వెళ్ళేముందుతన ఎప్రెంటిస్ అంతా శంకరంగారివద్దే అయింది. నారాయణరావు తెలివితేటలు చూచి, డబ్బున్న వాళ్ళకు అందమైన వాళ్ళకు, చదువు అంవడదు అన్న అభిప్రాయాన్ని మార్చుకున్నారు శంకరంగారు.నారాయణరావు ఆ పరీక్షలో అత్యుత్తమంగా ఉత్తీర్ణుడవటానికి కారణం శంకరం గారంటే అతిశయోక్తి కాదు. ప్రతేకాభిమానంతో నారాయణరావుకు శిక్షణనిచ్చారు. అందుకనే వారి అభిమానానికి, ఆదరానికీ, కృతజ్ఞతగా శంకరంగారు కోరినప్పుడల్లా వచ్చి, ఆయన పనిని చేసిపెడుతుంటాడు. శంకరంగారు గవర్నమెంటులో ఓ పెద్ద బాధ్యతగల పనినుండి రిటైరయారు. ఆయనకూడా చార్టర్డ్. ఎకవుంటెంటు!రిటైరయినా మిత్రుల విజ్ఞప్తితో వారి ఇన్‌కంటాక్సు వ్యవహారాలు చూస్తుండటం పరిపాటయింది. అందుకనే అప్పుడప్పుడే పేరులోకి వస్తున్న తన శిష్యుడు నారాయణరావు సహాయాన్ని కోరుతూండటం, అలవాటయింది. ఈనాడు రావు ఆయనగారి అత్యవసర పనిమీదనే ఉన్నాడు.

అరుణాదేవి శంకరంగారి గారాబు కూతురు. రావుకు ఆమె తన ఎప్రంటీస్‌కాలం నుంచీ తెలుసు. అప్పుడామెఇంటరుచదువుతూండేది. అందువల్లనే ఒక్కొక్కప్పుడు శంకరంగారు లేనప్పటికీ వారింట్లోచనువుగా మెసలగలుగుతాడు.ఆమె తెలివైన దవడంవల్ల రావు కామంటే యిష్టం. ఆమె కొంచెం పెంకిపిల్ల అన్నప్పటికీ తప్పులేదు. శంకరంగారికి ముద్దుకూతురు. అవడంతో ఆమె ఆడిందే ఆట, పాడిందే పాట! ఆమెకు గారాబంవల్ల గర్వం, అభిమానించడంవల్ల అహంకారం, అందమైనదవటంవల్ల అసహనం, సహజంగా అలవడ్డాయి. ఆమెమాటకు యింటిలో తిరుగులేదు. అందరూ భయపడవలసిందే, శంకరంగారు కూడా! అటువంటి అరుణాదేవికై రావు తన కారు పంపించాలి. రావు డ్రైవర్ను అవసరం వుండదని పంపించి వేశాడు. శంకరంగారి మాట ప్రకారం తన కారు పంపాలంటే తనే డ్రైవ్ చెయ్యాలి. తప్పనిసరి అవడంవల్ల ఇంటికిపోయి స్నానాంతరం దుస్తులను మార్చుకుని భోజనం చేయకుండానే బయల్దేరాడు. అప్పటికే రాత్రి 9 గంటలవడంవల్ల. పాలనురుగులాంటి పల్చని మెత్తని సిల్కులాల్చీలోంచి తన శరీరాన్ని సముద్ర గాలి సరగలు తాకుతున్నాయి. దశమినాటి వెన్నెల అస్పష్టంగా వుంది. కొన్ని పల్చని మబ్బుతెరలు అడ్డుండటం వలన! రోడ్డు యొక్క ఎగుడు దిగుడులను దాటుకుంటూ, కారు యూనివర్శిటీ ఆవరణలోనికి ప్రవేశించింది. విర్సెన్ స్క్వేరుకు ఒకింత దూరంలో కారునాపి, దిగాడు రావు. ఆ స్క్వేరు ప్రవేశ ప్రాంగణంవద్ద ఓ నలుగురు విద్యార్థినులు నిరీక్షణులై నిల్చుని వున్నారు. వారి ముఖాలు క్రీనీడలోవుండటంవలన, వారిలో అరుణ ఉందో, లేదో, గుర్తించలేక పోయాడు. అక్కడే నిల్చొని ఆమె ఎక్కడుంటుందా? అని ఆలోచిస్తున్న రావుకు ఆ విద్యార్థినులలోనుంచి ఓ యువతి తనవైపు వస్తుండటం కనుపించింది. ఆమె సమీపించింది ... ... అరుణ!

"నాన్నగారు కూడా వచ్చారండీ!"

"లేదు కారు పంపించారు!"

"ఏదీ! ఆ డ్రయివరుగా డెక్కడున్నాడు?"

నారాయణరావుకు ఆమె స్వరంలోని ఉద్రిక్తతవల్ల కారు రావడం ఆలస్యమవడంతో కోపం వచ్చిందని గ్రహించాడు. మెల్లగా... ఆమె ముఖంలోనికి చూస్తూ అన్నాడు.

"అక్కడ కారు ఆపాడు...! ఇక్కడకు తీసుకు రమ్మని చెప్పేదా?" ఆమె ముంగురులొకటి రెండు కనుబొమల మధ్యగా ఫాలభాగంమీద వ్రేలాడుతున్నట్లు ఆ గుడ్డివెన్నెలలో గుర్తించాడు. అది ఆమె కొక వింతశోభనిచ్చింది.

"వూఁ! వాడికి కాస్త పొగరెక్కువయిందిలెండి! తాగితందనాలాడి వచ్చినట్లున్నాడు."

ఆమెమాటలు విన్నతరువాత రావు వెళ్ళి కారు బాక్‌చేసి, ఆ విద్యార్థినులు నిల్చున్న చోటుకు దగ్గరగా తీసుకొచ్చి ఆపాడు. అక్కడే అరుణ ఓ పొరపాటు చేసిందనాలి. ఆమె కారు రాలేదన్న కోపంతో రావుకు అక్కడకు రావలసిన పనేమిటో, వాళ్ళకారెందుకు రాలేదో తెలుసుకోవాలనిపించలేదు. అలా ఆయినట్లయితే, అరుణకిప్పుడింత బాధనిపించకపోను. రావు దగ్గరకొచ్చి "మాకారెక్కడుందండీ ... ?" అంది.

"నాన్నగారు అర్జంటుగా వారి స్నేహితుణ్ణి కలుసుకోవడానికి కారుమీద వెళ్ళారు. నన్ను యూనివర్శిటీకి కారు పంపించమన్నారు. మా డ్రయివరు లేకపోవడంవల్ల నేనే తీసుకుని రావలసి వచ్చింది." స్పష్టంగా, దృఢంగా, నెమ్మదిగా అన్నాడు. ఆ పరిస్థితిలో అరుణకు ఏం చేయాలో తోచలేదు. అయినా కొంచెం ధైర్యంతో అంది :

"మా కారొస్తుందనే ఉద్దేశ్యంతో గరల్సు హాస్టలునుండి మా ఫ్రండ్సునుకూడా తీసుకొచ్చాను." ఆమెస్వరం ఏదో తప్పుచేసి పశ్చాత్తాపపడుతున్నట్లుగా వుంది. రావు ఆమె పరిస్థితిని అర్థం చేసుకుని :

"ఏ కారొచ్చినా మీ గురించేగా! కారెక్కమనండి పోదాం!" ఫ్రంట్‌సీటులో అరుణ, బాక్ సీటులో ఆమె ముగ్గురు స్నేహితురాండ్రు కూర్చున్నారు. కారు హాస్టలు ముందు ఆగింది ఆ వనితలు ముగ్గురూ దిగి, తరువాత రావుకథాంక్సు చెప్పారు. కారు పోనిస్తూ రావు అన్నాడు:

"ఎటు పోనివ్వ మన్నారు?"

"మీ యిష్టం ... !"

ప్రస్తుతం నేను మీ డ్రయివరును మాత్రమే. మీ రెక్కడికెలా తీసుకువెళ్ళమంటే అలా తీసుకుని వెడతాను. లేకపోతే నాన్నగారికి నేను సంజాయిషీ యివ్వుకోవలసి వుంటుంది. చిన్నగా నవ్వుతూ, ఆక్సిలేటరును కొద్దిగా నొక్కుతూ, అన్నాడు.

అరుణకు చాలా బాధనిపించింది. తనిందాక డ్రైవరన్నమాటను ఎత్తిపొడుస్తున్నాడని గ్రహించింది. ఒకవేళ శంకరంగారితో ఆ విషయం చెబితే రావునలా అన్నందుకు ఏమంటారో అన్న భయమేసింది. అంత గడుసు అమ్మాయికీ రావంటె ప్రత్యేక గౌరవాభిమానాలున్నాయి. అందుకనే కాస్త తక్కువ స్వరంతో క్షమార్పణ వేడుకుంది.

"క్షమించండి! యిందాకను మా డ్రయివరు వచ్చేడేమోననుకుని అలా అసందర్భంగా మాట్లాడాను."

నారాయణరావుకు నవ్వొచ్చింది. నవ్వుతూనే అన్నాడు.

"మీ డ్రైవర్ను అన్నదానికి నే నెందుకు క్షమించడం ?"

కారు శంకరంగారింటి ముందు ఆగింది. అప్పటికింకా శంకరం గారు రాలేదు. డోరు తెరచి కారు దిగుతున్న అరుణతో

"నాన్నగారితో ఆలస్యమయిందని చెప్పకండేం అన్నాడు రావు నవ్వుతూ!" రావు చిలిపిగా మాట్లాడినా ఆమె మనస్సెందుకనో మథన పడసాగింది.

రోజులు గడుస్తున్నాయి. కొన్ని నెలలుగడిచాయి! ఈమధ్యలో అనేకమైన మార్పులుజరిగాయి ప్రపంచంలో! అందులో మనకుసంబంధించినవి.. అరుణప్రవర్తన రావు పట్ల మారడం...ఎప్పుడూ లేనిది అరుణ రావంటె సిగ్గు పడటం.. ఎందరిలో అతని కెదురుపడకుండా తప్పించుకోవడం....! అతన్నిఒంటరిగా ఉన్నప్పుడు తదేకంగా చూడడం.. నారాయణరావుకు ఆమె ప్రవర్తనలోని ఆకస్మిక ప్రవర్తన ఆశ్చర్యమనిపించింది. శంకరావుగారు రావు సహాయంవల్ల చాలావరకు రక్షింపబడ్డారు. అందుకని రావుని ప్రత్యేకంగా వారింటికి ఒకనాడు తీసుకెళ్ళి, అతని సహాయానికి తగిన ప్రతిఫలంతోను ఆనంద బాష్పంలోనూ అమిత కృతజ్ఞతను వెల్లడి చేసుకున్నారు. వారి ఆదరాభి

మానాలకు గౌరవ మర్యాదలకు రావు మనస్సు ఆర్ద్రత చెందింది. రామారావుగారు, విశాఖపట్నంలో ఓ ఇల్లు కట్టించుకొని అక్కడే స్థిరపడ దలచినట్లు, ఇందిరను ఎమ్. ఏ. లో చేర్పించ దలచినట్లు చెప్పారు. రావు గృహోన్ముఖుడవడానికి సిద్ధమయాడు. వద్దని వారించినా రామారావు గారు సాగనంపడానికి వస్తానన్నారు. దుస్తు మార్చుకోవడానికై ఈ ఏకాంతసమయంలో ఇందిర:

"మిమ్మల్ని మరిచిపోరనుకుంటాను!" అంది ఆమె స్వరంలో ఒక దైన్యత, మోములో ఓ అస్పష్టపు విచార రేఖలు, కళ్ళలో ఒకింత విషాదం కన్పించాయి. ఆమె మోమును కవులు వర్ణించినట్లు చంద్రుడితో పోల్చినట్లయితే, ఆ శశివదనం రష్యా రాకెట్టు తాకిడికి కాస్తంత కళావిహీనమయినట్లయింది. రావు ఆమె చూపులనుండి వెంటనే తట్టుకోలేకపోయాడు. అతనికి చాలమంది కులీన కుటుంబపు వనితలతో పరిచయముంది. వారుకూడా తనవేపు ఏదో కోరికతో చూసేవారు. వారి చూపులలోని తృష్ణ అతని మనస్సును ఏనాడూ కలవర పెట్టలేకపోయాయి. కాని. . . ఇందిర చూపులు . . . చూపులకు, చూపుల సంజ్ఞలకు ఏదైనా పరిభాష ఉన్నట్లయితే కొందరి చూపులు కావ్యాలవుతాయి. ఆ చూపుల భావాలు కొన్ని భాషకందవు. నారాయణరావు హైస్కూలులో చదివేటప్పుడు, కాలేజీలో చదివేటప్పుడు అతనితో మాట్లాడాలని ఉవ్విళ్ళూరే అమ్మాయిలు, అతన్ని తదేకంగా చూసేవారు చాలమంది ఉండేవారు. . . అందుకనే, అప్పుడప్పుడు అతని సహాధ్యాయినులయిన, వసంతమ్మ, కామేశ్వరి, మైథిలి, సీతాలక్ష్మి, రేణుక మొదలగువారు స్మృతిపథంలో కదుల్తుంటారు. వారి చూపుల భావాలు, వారి ఆశాజనకంగా తనవైపుచూసే కన్నులు గుర్తొచ్చినప్పుడల్లా విచలితుడవుతాడు. అతని మనస్సు ఓవిధమైన అనుభూతితో నిండిపోతుంది. ఇందిర వైపు చూస్తూ అన్నాడు :

"ఎందుకు మరచిపోతానండీ! మీరెప్పుడూ గుర్తుంటారు. . . . మీ ఆదరాభిమానాలకు కృతజ్ఞుణ్ణి . ." బరువైన హృదయంతో ఇంటికి చేరుకున్నాడు.

అరుణ ఆనర్సు ప్యాసయింది. రామారావుగారు మహారాణిపేటలో ఓయిల్లు కట్టించారు. ఇందిర ఎమ్. ఏ.లో చేరింది. రావు యింటికి రామారావు గారు ఇందిరతోసహా వచ్చి తను క్రొత్తగా కట్టించిన యింటికి రమ్మనమని ఆహ్వానించారు. తప్పక వస్తానని మాటయిచ్చాడు. కాని. . . అదేరోజున శంకరంగారి గారాబుకూతురు అరుణాదేవి పుట్టిన రోజు పండగ! శంకరంగారు నారాయణరావుకై కారులోవచ్చి దగ్గరుండి తీసుకెళ్ళారు. రావు సాయంకాలం రామారావు గారింటికి వెళ్ళొచ్చు ననుకున్నాడు. కాని మానవుడు అనుకున్నట్లుగా అత్యల్పవిషయాలు, అతని స్వాధీనంలోనివి కూడా జరగవని ఆనాడు తొలిసారిగా గ్రహించగలిగాడు. అలా సంభవించడం మానవుని అసమర్థతో, లేక పరిపాకమో నిర్ణయించుకోలేకపోయాడు. అలా అత్యల్పమైన విషయాలకు అవాంతరాలొస్తే మనసు గాయపడుతుందని వూహించలేకపోయాడు.

మధ్యాహ్నం డిన్నర్‌కు కొంచెం బలవంతంతో ఉండిపోయాడు . . . కాని సాయంకాలం తన్ను ఫ్రీగా వదిలేస్తారని రామారావు గారింటికి వెళ్ళొచ్చునని తలపోశాడు. కాని. . . ఎందుకలా అరుణ పట్టుబట్టిందో తనకిప్పటికీ అర్థంకాదు. ఆమె అలా ప్రవర్తించడంలో, ఆమె తనమీదేదో అధికారమున్నదనుకొని, దాన్ని ఉపయోగించుకొని ఉంటుంది. నిజానికది అలా సంభవించడం రావుకు శంకరంగారిపైగల అత్యంత శ్రద్ధాభక్తులవల్ల తప్పనిసరి అయింది. రావు తప్పనిసరిగా వెళ్ళిపోతానని చెప్పినపుడు, శంకరంగారు అట్టే బలవంతపెట్టలేకపోయారు. కాని అరుణ, రావు వెళ్ళడానికి వీల్లేదని పట్టుబటింది. అలా జరిగితే తను ప్రోగ్రామ్ కేన్సిల్ చేసుకుంటానని హఠం చేసింది. తరువాత రావుని శంకరంగారు అభ్యర్థించడం. . . . రావు కాదనలేకపోవడం జరిగాయి. రావు అక్కడున్నప్పటికీ, అతనిమనస్సు రామారావు గారింటివద్ద, ఇందిర అభ్యర్థన వింటూ తచ్చాడుతుంది. అనుకున్న ప్రోగ్రామ్ ప్రకారం పిక్చరుకు బయల్దేరారు. రావు సహనాన్ని కోల్పోయాడు. ఆలోచనస్తంభించింది. యాంత్రికంగా వారివెనుక నడిచాడు. థియేటరులో, బాల్కనీలోనున్న ఆఖరి వరుసలో చివర కూర్చున్నారు. అరుణ మధ్య కూర్చుంది. కుడివైపు రావు,ఎడమవైపు శంకరంగారు కూర్చున్నారు. రావు అన్యమనస్కుడై వున్నట్లు వారిరువురూ గ్రహించారు. పిక్చరు మరోకొద్దిక్షణాలకు ప్రారంభిస్తారనగా మరో అనుకోని సంఘటన జరిగింది. ఆ పిక్చరుకే వచ్చిన రామారావు గారు రావునుచూసి చూసి దగ్గరకొచ్చి అన్నారు:

"మీగురించి చాలాసేపు ఎదురుచూశాం. మీరు రాకపోవడంతో నేనెంత బలవంత పెట్టినప్పటికీ ఇందిర ప్రోగ్రామ్‌కాన్సిల్ చేసి పిక్చర్‌కు రాకుండా ఇంటివద్దే వుండిపోయింది.

ఆయన ఆ మాటలన్న తరువాత చిన్నగా నవ్వడానికి ప్రయత్నించారు. అరుణకు, శంకరం గారికి ఆ నూతన వ్యక్తి ఎవరో అన్న కుతూహలం కలిగింది. అరుణ మనస్సు పరిపరివిధాల పోయింది. ఆమె చెవులలో 'ఇందిర' అన్న పేరు గింగురుమంటుంది. రావువైపు తదేకంగా చూస్తుంది. అతనికి ఆక్షణంలో ఏమని మాట్లాడాలో, ఏమని సమాధాన మివ్వాలో తోచలేదు. ఏదో విపరీత పరిస్థితి తటస్థపడినట్లు ఫీలయాడు. అతన్ని శంకరం గారికి పరిచయం చేయాలనేది సభ్యతన్న విషయంగూడ విస్మరించాడు. ఆ పరిస్థితులలో అతను క్షంతవ్యుడు. కొద్ది క్షణాల అనంతరం అన్నాడు.

"రేపుదయం తప్పకుండా మీయింటికి వస్తాను. ఈరోజు అత్యవసరంగా ఉండవలసి వచ్చింది."

రామారావుగారు సరేనన్నారు. రావుని, ఆపరిస్థితులలో చూసిన రామారావుగారు, ప్రశ్నించి విసిగించదలచుకోలేదు. ఆట ప్రారంభమయింది.

ఆ మరుచటి దినం ఉదయం రావుకు నిజంగా మరపురానిది. అతని జీవితంలో ఆరోజు ఓ ప్రత్యేకతను సంపాదించింది. అరుణను, చూసిన రామారావుగారు ఆవిడ అర్థాంగేనని ఊహాపడ్డారు. ఆవార్త ఇందిరను చేరడానికిఎంతోసేపు పట్టలేదు. ఆమె మనస్సు మూగబోయింది. ఆమె ఆశలు భవిష్యజ్జీవితంపైని కలలు కరిగిపోయాయి. ఆమె ఎందుకనో బాధపడుతోంది. అది అర్థరహితమని ఆమె సమర్థించుకున్నా ఏదో అజ్ఞాతమైన మమత మనస్సును మథన పెడుతోంది. రావు వచ్చాడు. రామారావుగారు లోపలున్నారు. ఇందిర హాలులో ఉంది. ఇందిరకు రావుని చూచిన వెంటనే ఏమని పలకరించాలో, ఏమని మాట్లాడాలో తెలిసింది కాదు. ఆమె కళ్ళలో ఏదో వ్యథ సుస్పష్టం. ఆమె సోఫాలోంచి లేచింది.

"క్షమించండి! నాగురించి మీరు చాలసేపు ఎదురు చూశారట. కొన్ని అనివార్య కారణాలవల్ల రాలేకపోయాను. నేను రాలేక పోయినప్పటికీ నా మనస్సంతా యిక్కడే ఉంది." అన్నాడు ఆమె కళ్ళలోనికి చూస్తూ! రావు నిల్చొనే మాట్లాడాడు. ఇందిర కూర్చోమంది. అతను కూర్చున్న తరువాత, ఇందిర కూడా కూర్చుంది. రావే తిరిగి అన్నాడు.

"నాన్నగారు నిన్న థియేటరులో కన్పించి చెప్పారు. మీరు ప్రోగ్రామ్ మానుకొని, ఇంటి వద్దే ఉండిపోయినట్లు ... మరోలా అనుకోకండి"

ఇందిర వైపు చూస్తూ మాట్లాడుతున్న రావుకు ఆమె మోములో ఏదో అస్పష్టపు ఆవేదన గోచరమయింది. రావు గొంతుక ప్రాధేయతనూ, పశ్చాత్తాపాన్నీ సూచించింది. ఇందిర కొన్ని క్షణాల అనంతరం అంది.

"మీరు నిన్నను ఫామిలీతో పిక్చరుకువెళ్తారని తెలిస్తే, మేం ప్రోగ్రామ్‌ను ఇంకోరోజుకు మార్చేవారం ... !" రావుకు ఆశ్చర్యమనిపించింది. తను ఫామిలీతో పిక్చరుకు వెళ్ళడమేమిటా అని! ఇందిర తననెందుకలా అన్నదో వెంటనే గ్రహించలేకపోయాడు. ఇంతలో రామారావుగారొచ్చారు. పరస్పరపలకరింపుల అనంతరం, ఆయన—

"నిన్నను,మన మనుకున్నప్రకారమూ ఎలానూ జరగలేదు. అదీ మంచికే అనుకుంటాను. మీ దంపతులిద్దరూ వచ్చే ఆదివారం తప్పకుండా రావాలి" అన్నారు.

రావుకు పరిస్థితి అర్థమయింది. అరుణను తన అర్థాంగిగా అపోహపడ్డారు. ఇందిర క్రితంలో అన్నదానికి అర్థం బోధపడినట్లయింది. ఒక్కక్షణం నివ్వెరపోయాడు. ఏమని, ఎలా? వాళ్ళకు నిజాన్ని తెలియజేయాలో తెలిసిందికాదు. ఈ సంకటావస్థలో—

"ఆవిడ ప్రక్కనున్నాయన మీ మామ, అనుకుంటాను" అన్నారు రామారావు.

నారాయణరావుకు చాలా చికాకనిపించింది. ఇందిరమాటల్లోనివ్యధకుకారణం, ఆమె మునుపటి ఉత్సాహంచూపక పోవడానికిగల హేతువు వూహించ గలిగాడు. ఇందిర తననుండి ఏదో ఆశిస్తున్నదన్న అభిప్రాయాన్ని దృఢపరచుకున్నాడు. అరుణ కూడా అంతే! ఆమె తనను స్వంత మనిషిలా భావిస్తుంది. అది అతనికి బాధగా ఉంది. ఆమె సాన్నిధ్యం, స్నేహితత్వం అతన్ని సంతోషపెట్ట లేకపోతుంది. అత్యంత కోమలమైన, మృదువైన ఆమె హస్తం, థియేటరులో అతని హస్తాన్ని తాకినప్పుడు, ఆస్పర్శ అతనిలో ఏట్టి అనుభూతిని కలిగించలేకపోయింది. అరుణకు అతను కావాలి! ఆవిషయాన్ని ఆమె ప్రవర్తనే రుజువు చేసింది. క్షణకాలంలో ఈ విషయాలన్నీ అతని మనస్తత్వంలో మెదిలాయి! ఈ అనవసరపు జంజాటం నుండి విముక్తుడు కావాలని నిశ్చయించుకున్నాడు. రాఘవరావుగారితో దృఢంగా, శాంతంగా అన్నాడు.

"మీరు పొరపడ్డారండి! నిన్న థియేటరులో కన్పించినవారు, ప్రభుత్వోద్యోగినుండి రిటైరయిన వార్ధక్యం ఎక్కువుంటుంది! నా ప్రక్కనున్న ఆమె వారి కుమార్తె. ఆయన వద్దనే నాకు ప్రెంటిస్‌అంతాఅయింది.ఆయన నాకు గురుతుల్యులు. అంతకు మించి మరే యితర సంబంధము లేదు. నేను అవివాహితుణ్ణి."

రాఘవరావుగారు ఇందిర చాలా బాధపడ్డారని రావు, వారి అసంబద్ధపు అపోహకు మన్నింపమన్నారనేది అనవసర విషయం. నిజంగా బాధపడ్డవాడు రావు. ముఖ్యంగా ఇందిర అపోహ పడడం, ముభావంగా వుండడం అతన్ని ఒకింత కలతపెట్టాయి! ఆమె యెడలలోని జాలి, ఆకర్షణ ఎక్కువమరచిపోలేదు!

సాయంకాలం శంకరం గారింటికి మిగిలిన పని పూర్తి చేద్దామని వెళ్ళాడు. శంకరంగారు లేరు. అరుణ, రావు వెళ్ళేసరికి హాలులో ఉంది. ఆ హాలు ఆనుకొని ఉన్న ఓగదిని తనకై ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్నారు శంకరంగారు. ఆ గదిలోనే రావుకు పని. శంకరం గారు లేనందుకు ఆహ్వానించవలసిన బాధ్యత అరుణది. కాని ఆమె ప్రవర్తన దానికి విరుద్ధం. రావును చూసిన అరుణ అలా ప్రవర్తించిందంటే, ఓక్షణకాలం నమ్మలేకపోయాడు. ఆమెకు తనపై అంత విముఖత కలగడానికి గల కారణం కన్పించలేదు. ఒకింత అన్యమనస్కుడై శంకరం గారి గదిలోనికి పోయి కూర్చున్నాడు. శంకరం గారి గూర్చి ఏవిషయమూ తెలియదు. అరుణతో ఆవిషయం మాట్లాడాలి. అందుకు ఆవిడ సుముఖంగా లేదు. తనను అవమాన పరచి పోయింది. మనస్సు గాయపడింది. శంకరంగారింటికి ఆయన లేనప్పుడు ఎన్నడూ రాకూడదనుకున్నాడు. ఎందుకిప్పుడొచ్చానా ? అని వ్యధ చెందాడు. ఇంతలో బంట్రోతు 'ట్రే'లో ఓవల్టీను తెచ్చాడు.

"ఎవరికోయ్"!

"నాకేం బాబూ ! అరుణమ్మగారిచ్చారు"

రావుకు ఆశ్చర్యమనిపించింది, ఆమె ప్రవర్తన. అతిథిని ఆహ్వానించకుండా అవమానపరచిన అరుణ ఓవల్టీను పంపించి మర్యాద చేయబోవడం హాస్యాస్పదంగా తోచింది. అరుణాదేవి ధనికుల బిడ్డ. విలక్షణ సౌందర్యవతి. కొంతమంది స్త్రీలు భర్తలను ప్రాణప్రదంగా ప్రేమిస్తారు. వారికే మాత్రం కష్టం కలిగినా తల్లడిల్లి పోతారు. మనస్సులో ఎల్లప్పుడూ భర్త శ్రేయస్సునే, తద్వారా వారి మంగళప్రదాన్ని కాంక్షిస్తుంటారు. వారికి భర్తలు తరువాతనే మిగతా విషయాలు గణనీయాలు. కాని...... అటువంటి వనితలతో ఓ ప్రమాదముంది. వారు భర్తల నెంతగా ప్రేమించి, పూజించగలరో, వారి ఎడల అంత విముఖత్వాన్ని చూపి ద్వేషించగలరు. వారి మనస్సులు ఎంతగా ఆదరించగలవో అంతగా అవమాన పరచగలవు. అది వాళ్ళ స్వభావం. అరుణ పైకోవకుచెందినవ్యక్తి.ఆమె రావుని చూసిమోహపడ్డది.. వాంఛించింది.. ప్రేమించింది.ఆమెలో ఆ ఆశలు ఎరాకాష్ఠ నందుకున్నాయి. అందువల్ల రావు తనవాడౌనని వూహించుకుంది.. భ్రమించింది.. తనవాడైన రావు పరస్త్రీలతో సంబంధం ఉందని అపోహ పడింది..'ఇందిర'' అనేయువతితో రావుకు సన్నిహితత్వంఉందని వ్యధ చెందింది. అందుకే రావుని చూసి చివాలున లేచి లోనికి వెళ్ళింది... తనవాడనుకున్న రావు దూరం కాకూడదు... పరాయివాడు అవకూడదు..అందుకనే వెంటనే ఓవల్టీనుపంపించింది.రావు ఆవచ్చిన తనితో అన్నాడు.

"ఓ సారి అరుణమ్మగారిని పిలువు ! నేను వెళ్లి పోతున్నానని చెప్పు !"

అరుణ వచ్చింది. రావు మనస్సు గ్లానితో నిండి వుంది. శంకరంగారు తప్పని సరిగా రమ్మనడం వల్ల తనొచ్చాడు. శంకరంగారు తనను రమ్మని మని చెప్పి, అలా ఎన్నడూ బైటికివెళ్ళరు. ఆయనకు అత్యవసరమైన పని వుండి వెళ్లారని అనుకున్నాడు. ఆవిషయమై అరుణతో ప్రస్తావించడం అతని కిష్టం లేదు. దృఢంగా అన్నాడు.

"నాన్న గారు వచ్చిన తరువాత కబురు పంపించమనండి ! నేను వచ్చినట్లు చెప్పండి. నేను వెళ్తున్నాను"

"ఏం! నాన్న గారొచ్చేవరకూ ఉండకూడదా ?"

" ఉహూ...! నేను వేరే చోటికి వెళ్ళాలి "

"...........బహుశా 'నిన్న థియేటర్‌లో కన్పించారే.. వారింటికి కాబోలు ! ఇందిర— గురించి ...... "

స్వాభావికంగానే నవ్వుతూ మాట్లాడబోయింది.కాస్తంత వ్యంగ్యం స్ఫురించింది. ఆమె మాటలలోని సహజత్వాన్నది పోగొట్టింది. ఆమె కక్కడ వివరాలన్నీ విశద పరచే సహనం అతనిలోలేదు. వీరి అనుచిత అసందర్భఅపోహలకు బాధగా వుంది. అరుణ కళ్ళ లోనికి సూటిగా చూసాడు. ఆ చూపులు "నన్నిలా అర్థం చేసుకున్నారన్న మాట!"అని ప్రశ్నిస్తున్నట్లున్నాయి. వస్తానని చెప్పి వెడలిపోయాడు. వెంటనే ఇల్లు చేరాడు. అతనిమనస్సు శరీరం, చాలా—అలసటగా వున్నాయి. ఏవో అనవసర విషయాల్లో జోక్యం కల్పించుకున్నట్లు బాధ పడుతున్నాడు. ఇందిర, అరుణ పరస్పరం అపోహ పడ్డారు.తమ వారి అపోహలకు సరిగా ఉపయోగించుకున్నారు. ద్వారం వద్ద చప్పుడవడంతో తన చెల్లెలు రాధారాణి అయివుంటుందనీ ఉద్దేశ్యంతో

"కాస్త ఐస్‌వాటర్ తీసుకురా చెల్లీ!"అన్నాడు నిజానికి అవతలివైపు నుంచి సమాధానం రాలేదు. కాని వచ్చి ఉంటుందనే అభిప్రాయ పడ్డాడు. హాలులో పడమవైపున్న సోఫాలో పడుకున్నాడు. నైలాన్ సాక్సుతో వున్న పాదాలు రేడియోగ్రామ్ వైపు, తల, వాలు కాలుకొని వున్న గదులవైపు వుంది.

అప్పుడే రెఫ్రిజిరేటర్ తెచ్చిన ఐస్ వాటర్ తలవైపునుండి రావడంతో గ్లాసందుకుంటూ.

"తొందరపడి నీవెవ్వరినీ అపార్థం చేసుకోవద్దు చెల్లీ !" అన్నాడు. సమాధానం రాలేదు. రావు ఆశ్చర్య పడ్డాడు. రాధ తనతో ఎంతో చనువుగా అరమరికలు లేకుండా అన్నిసంగతులు చెబుతుంది.నారాయణరావు, రాధారాణిని అమితంగా ప్రేమిస్తాడు. ఆమెకే చిన్న కష్టం వచ్చినా సహించలేడు. అందుకనే,ఇందిర, అరుణల దగ్గర నేర్చుకున్న పాఠాన్ని తన చెల్లికి చెప్పదలచుకున్నాడు. తనంటే అత్యంత అభిమాన ముండక పోవడంతో—

" ఏం రాధా ? మాట్లాడవే !" అంటూ సోఫాలోంచి లేచి చూచాడు. "ఓ ...శ్రీ దేవి.... నీవెప్పుడొచ్చావ్ ?"

శ్రీదేవి నాన్నగారు, నారాయణరావు నాన్న గారు స్నేహితులు, అత్యంత సన్నిహితులు! శ్రీదేవి నాన్నగారు కృష్ణాజిల్లాలో పేరుమోసిన ఓ ధనిక భూకామందు. ఆయనపేరు పరంధామయ్య. ఆయన తన గారాబు కూతురును విశాఖపట్నంలో ఎం. బి. బి. ఎస్. చదివిస్తున్నాడు. రావు తండ్రి గారు తనింటికి తీసుకొస్తుండడం, తరచూ ఆమె హాస్టలుకు పోయి క్షేమ సమాచారాలను తెలుసుకుంటుండడం పరిపాటయింది. కాని.. రావు తండ్రిగారు పరమపదించడంతో, శ్రీదేవి నారాయణరావింటికి రావాలంటే పరంధామయ్య గారు వచ్చినప్పుడుమాత్రమే అవకాశముండేది కాని ఇప్పుడు రావు చెల్లి రాధారాణి మెడికల్ కాలేజీలో చేరడంతో ఆమె ఆంతరంగిక అభిలాషకు అవకాశం లభించింది. ఆమెతో అప్పుడప్పుడు కోఆపరేటివ్ కాలనీకి వస్తుండడం అలవాటయింది. ఆమె, వచ్చినప్పుడల్లా రావుతో ఏకాంతంగా కూర్చొనిమాట్లాడాలని ఆ మగువ మనసు వాంఛించేది. కాని.. ఆ విషయాలు తెలుస్తే వడేవికావు. మెడిసిన్ చదివే శ్రీదేవిలాంటి అందమైన యువతికి, తనకు కాబోయే భర్త మంచి హోదాతో కూడి ధనికుడవాలి. అందగాడూ, సహృదయుడూ కావాలన్నీ, ముందుగా ప్రేమిం

చినవాడై ఉండాలనీ వాంఛించడం సహజం! ఇకపోతే ఈ పై కోర్కెలకు ప్రాధాన్యత ఇవ్వడం ఆయా మగువల మనస్తత్వాలపై ఆధారపడి వుంటుంది. శ్రీదేవి, నారాయణరావుతో పరిచయమైన తర్వాత అతనిని ప్రేమించి, అతనంటే మోహపడి తనవాడుగా కావాలని కోరుకోవడం అందుకనే! ఆమె, రావు తన హృదయ వీణను మీటగలడనీ, మనస్సును రంజింపచేయగలడనీ, సౌందర్యాన్ని ఆస్వాదించగలడనీ, విశ్వసించేది. అందుకనే రావుతోటి ఏకాంత సాన్నిధ్యాన్ని కావాలంటుంది. రావుకూడా శ్రీదేవిని చూసినపుడల్లా ఆమె సౌందర్యానికి పరవశితుడయేవాడు. ఆమె సౌందర్యం ఆరాధ్యమేయుంగాని, అనుభవింపరానిదనే అపోహతో ఆకోర్కెను, అతని వివిధానుభూతులను విరమించుకునేవాడు. ఆమెను 'ఏమండీ!' అనేసంబోధించేవాడు. కాని శ్రీదేవి పరంధామయ్యగారితో చెప్పి ఆరకపు సంబోధనను మాన్పించింది. అందుకనే రావు నీవెప్పుడొచ్చావ్? అనడంతో,

"ఓ గంటవుతుందిలెండి. . !" స్మిత వదనంతో సమాధాన మిచ్చింది.

"రాధెక్కడుంది ?"

"డ్రెస్ చేసుకుంటుంది ... పిలవమంటారా ?

"ఊహ. . అవసరంలేదు . . ఇందాకను రాధే మోనని అలా . . మాట్లాడాను. .." అన్నాడు తన కుడిచేతి వ్రేళ్లను చూసుకుంటూ! కొంచెం సిగ్గుపడుతున్నాడేమోననికూడా అనిపించింది.

"మీరు చెప్పిన మాటలను నేను మీచెల్లాయికి చెప్తాలెండి ..." అంది నవ్వుతూ! ఆమె అలా అనడంతో నవ్వుతున్న ఆమెవైపు చూసాడు. చల్లని వెన్నెల, పిల్లవాయువుల సరగలతో మేళవించి, అతని మనసు మీదినుంచి సాగిపోయినట్లనిపించింది. ఆమె నవ్వు! రెండు గులాబి రెమ్మల నడుమ, చిన్న మల్లెమొగ్గలవలె ఆమె పెదవుల మధ్య పలువరుస కన్పించింది. ఆమె చెక్కిళ్లు రవంత చలిస్తున్నట్లున్నాయి. మందస్మిత వదనంతో మనోహరంగానున్న శ్రీదేవిని తదేకంగా కొన్ని క్షణాలు చూసాడు. ఆమెలో బుచ్చిబాబుగారి కోమలినీ, బాపిరాజుగారి అనంతలక్ష్మినీ, చూడగలిగాడు. రావు ఏమీ మాట్లాడకుండా తనవైపు చూస్తుండడంతో శ్రీదేవి తిరిగి అంది:

"మీరేమీ అనుకోనంటే మిమ్మల్నొకటి అడగదలుచుకున్నాను."

"అడుగు శ్రీదేవి! . . అనుకునేదేముంది ?"

"మీరు రాధకెందుకలా చెప్పాలనుకున్నారు. ."

ఆమె ప్రశ్నతో అతని ముఖం ఒకింత మ్లానమయింది. ఉదాసీనతవల్ల వెంటనే సమాధానమివ్వలేకపోయాడు. కొద్దిక్షణాలు పోయిన తర్వాత—

'ఆ కారణం నీకు తెలియజెయ్యాలంటే నా మనస్సు మరొకసారి మథనపడుతుంది. ఆ కారణాన్ని నీకు తెలియజేస్తే నాబాధ కొంత తగ్గి



గుర్రం పరుగెత్తుతోంది ... — యస్. యస్. ప్రయాగ

మనస్సు తేలికపడుతుందనుకుంటాను.. కాని. . . ఆసంగతి నీకు బాధాకరమేమోనని. . . . ."

అంటూ ఆగిపోయాడు. అతని స్వరం ఆమెని ప్రశ్నించినట్లుంది. శ్రీదేవి ఈ అవకాశాన్ని జారవిడవలేదు. ఈ సందర్భంలో తన లభీష్టాన్ని తెలియ జేయాలనుకుంది.

"మీ బాధను పంచుకోవడం నాకెప్పుడూ ఇష్టమే! నిజానికి . . . నాకంత అదృష్టమేవుంటే మీ జీవితంలో ప్రవేశించి మీకష్ట సుఖాలలో భాగస్వామిని కావాలని ఉంది." అంది అవనత ముఖియై! నారాయణరావు ఆమెలభిష్టం తేటతెల్లమయింది. అతనికి అప్రయత్నంగా అరుణ, ఇందిర గుర్తుకొచ్చారు. జీవితంలో మానవుడికి కొందరు వ్యక్తులు తటస్థపడి పరిచయస్థులవుతారు. ఆ పరిచయకాలం స్వల్పం. జీవితంలో అతనికి తిరిగి వారు తటస్థపడరు. కాని జీవితాంతం, వారి మూర్తులు, వారితోటి ఆక్షణాల అతని హృదయావనికపై గాఢంగా చిత్రీకరించుకుపోతాయి. అవి అప్పుడప్పుడు అతని మనోనేత్రానికి దర్శనమిచ్చి అతని మనస్సును కలవరపరుస్తాయి. రావుకు ఇందిర, అరుణ అటువంటి వ్యక్తులుగా తనజీవితంలో నిలిచిపోతారనుకున్నాడు. ఇందిరయొక్క జాలిగొలిపే, ఆకర్షవంతమైన చూపులు గుర్తొచ్చాయి. అతని మనస్సు ఆర్ద్రత చెందింది. శ్రీదేవికి ఆమె, అన్నమాటలకు సమాధానమివ్వాలని స్ఫురణ కొచ్చింది . . సమాధానం ఇద్దామనుకుంటుండగానే రాధారాణి హాలులో ప్రవేశించింది.